క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న పాండు

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ర్యాకల పాండు తన తల్లిదండ్రులు ర్యాకల బాలయ్య, జగదాంబ జ్ఞాపకార్థం రూ.51వేల విరాళాన్ని ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అన్మారి వెంకటయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం



మిత్రుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

కేశంపేట: చిన్నప్పుడు కలిసి చదువుకున్న తోటి మిత్రుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడిది నిరుపేద కుటుంబం కావడంతో తోటి బాల్యమిత్రులు ఆదుకోవాలని సంకల్పించారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో సిలివేరు శ్రీశైలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో అదే గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000ల సంవత్సరంలో పదో తరగతి చదివిన తోటి మిత్రులు ఆర్థికసాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఆదివారం మృతుడి పిల్లలపై 80వేల ఫిక్స్‌డ్ బాండ్‌తో పాటు కుటుంబ అవసరాల నిమిత్తం 5వేల రూపాయలు మిత్రుడి భార్యకు అందించారు. కార్యక్రమంలో శివనంద్, జహంగీర్, శేఖర్, వీరేష్, రమేశ్, ఆంజనేయులు, కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం



బాధితులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

నందిగామ: అనారోగ్యాలకు గురైన నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన తోట అనిత అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స కోసం ఇబ్బందులు పడుతూ సహాయం కోసం ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి తమ సమస్య చెప్పుకోవడంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.50లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే ఆదివారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు ప్రభుత్వం ఎంతగానో సహాయం చేస్తుందని వివరించారు. ఎల్‌ఓసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, నాయకులు జ్ఞానేశ్వర్, రవీందర్‌గౌడ్, హనుమంత్‌గౌడ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజీ రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్టీసీ మాజీ కార్మిక నాయకుడు బీజీ.రెడ్డికి ఆదివారం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో ఆవరణలో బీజీ.రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన బీజీ.రెడ్డి ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఆర్టీసీ కార్మిక నాయకుడిగా అనేక సేవలను అందించారన్నారు. బిజి.రెడ్డి అకాల మరణం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'

- చేవెళ్లలో కనిపించని సిగ్నల్ వ్యవస్థ
- రోడ్డుపై నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు తప్పని తిప్పలు
- సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ జాం(ఫైల్)

చేవెళ్ల: రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాల సంఖ్యతో చేవెళ్ల మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవుతున్నాయి. నిత్యం ఈ రోడ్డుపై వాహనాల రద్దీతో మండల కేంద్రంలో ట్రాఫిక్ జామ్ అవుతూ వాహనాలు బారులు తీరుతున్నాయి. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నా వాహనదారుల సమస్యలు పరిష్కారం కాకపోవటంతో మండల ప్రజలు ట్రాఫిక్ పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలో ఏ చౌరస్తాలో సిగ్నల్ వ్యవస్థ లేదు. ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదుకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ అవుతుంటే క్లియర్ చేయాల్సిన బాధ్యత ఎవరిపై ఉందని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. చలాన్లు వేయటమే కాదు ట్రాఫిక్ క్లియర్ కూడా చేయాలని కోరుతున్నారు.

కనిపించని ట్రాఫిక్ సిగ్నల్స్

మండల కేంద్రం మీదుగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి కలిసి ఉండడంతో ఈ రోడ్డుపై నిత్యం వాహనాల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఈ రోడ్డుపై వికారాబాద్, పరిగి, తాండూర్, కొండగల్, కర్ణాటక రాష్ట్రానికి హైదరాబాద్‌కు లింకుగా ఉంది. దీంతో పాటు ఈ రోడ్డుపై ఉన్న మండలాలు, గ్రామాల ప్రజల వాహనాలు కూడా మండల కేంద్రం పైనుంచే వెళ్తుండటంతో నిత్యం ఈ రోడ్డు బీజీగా మారుతోంది. లోకల్ వాహనాలు కూడా తోడవటంతో ఈ ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. మండల కేంద్రంలో దుకాణాలు వద్ద వాహనాలు నిలపడం, చౌరస్తాలలో వాహనాలు అటు ఇటుగా పోతుండడంతో ట్రాఫిక్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉంది కానీ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేదు. గతంలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ మరిచారు. సిగ్నల్ కోసం సామగ్రి సైతం వచ్చినా వాటిని ఒకటి రెండు చోట్లు ఏర్పాటు చేశారు. అవి కూడా ఎక్కడా లేవు. మిగతా చోట్ల ఎక్కడ కూడా వాటిని ఏర్పాటు చేయలేదు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సివిల్ పోలీస్ స్టేషన్ రెండు పక్కపక్కనే ఉన్నాయి. ఈ పోలీస్‌స్టేషన్‌ల ముందే ఆర్టీసీ బస్‌స్టేషన్ చౌరస్తా ఉండడంతో నిత్యం ఇక్కడే వాహనాల జామ్ అవుతూనే ఉన్నాయి. పట్టించుకునే వారు కరువయ్యారు. చిన్న చిన్న అవసరాలకు దుకాణాలకు ద్విచక్ర వాహనాలపై వచ్చి వెళ్తుంటారని వారికి చలాన్లు వేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లు వేయటానికే పరిమితం కాకుండా ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని లేదంటే మండల కేంద్రంలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ట్రాఫిక్ పోలీసుల పనితీరు ప్రభుత్వం మార్చి వేసినట్లుగా వీరు మారిపోయారు. కేవలం వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు చలాన్లు వేయటమే పనిగా పెట్టుకున్నారు. ప్రతిరోజు వాహనాలకు చలాన్ల కోసం ఫొటోలు తీయటం తప్పా ఏమి చేయటం లేదు. చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నా క్లియర్ చేయటం లేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఫొటోలు మండల కేంద్రానికి దూరంగా తీస్తే బాగుంటుంది. అధికారులు ఆలోచన చేసి వాహనదారుల సమస్యలు పరిష్కరించాలి.

–రవీందర్, వాహనదారుడు, మల్కాపూర్

సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలి. ప్రధాన చౌరస్తాలలో ఉన్న రద్దీని గుర్తించి దానికి తగిన విధంగా ట్రాఫిక్ అంశాలు పెట్టాలి. చేవెళ్ల బస్‌స్టేషన్ వద్ద నుంచి బస్సులు వెళ్లే చౌరస్తా నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. శంకర్‌పల్లి చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యలు ఉంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చలాన్లపైనే కాకుండా ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టాలి.

–హరిలాల్, వాహనదారుడు, చేవెళ్ల

కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం



కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందిస్తున్న నాయకులు

చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల పరిధిలోని గొల్లగూడ గ్రామంలో సమావేశం నిర్వహించి గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో భీంభరత్‌తో పాటు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీకి కార్యకర్తలే బలం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో నెరవేర్చి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని చెప్పారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామ నూతన కమిటీలో అధ్యక్షుడిగా జంగయ్య, ఉపాధ్యక్షుడిగా గుజరయ్య, శంకరయ్య, కార్యదర్శిగా జి.రామచంద్రి, కోశాధికారిగా మహేందర్, సలహాదారులుగా సత్యనారాయణ, నర్సింలు, మంగలి రాములు, జంగయ్య, లింగం, యాదయ్య, నర్సింలు, చంద్రయ్య తదితరులు ఉన్నారు. పార్టీ కోసం పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌గుప్తా, నర్సింలు, టేకుపల్లి శ్రీనివాస్, మల్లారెడ్డి, గ్రామ యూత్ కమిటీ సభ్యులు మల్లేశ్, మహేందర్‌గౌడ్, రవీందర్, శివకుమార్, మల్లేశ్, మహేందర్, సురేశ్, హరీశ్, అనిల్, శశికాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో ఫిర్ ఏక్‌బార్ మోదీ సర్కార్

నియోజకవర్గ కన్వీనర్ విజయకుమార్



ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న డాక్టర్ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: కేంద్రంలో మరోసారి మోదీ సారథ్యంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ ధీమా వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు విచ్చేసిన ప్రధాని మోదీని శనివారం రాత్రి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సుస్థిర పాలన అందించారన్నారు. అట్టడుగు ప్రజల అభివృద్ధే ఎజెండాగా ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం 400 సీట్లతో అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజలు మరొక్కసారి ఆలోచించి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలన్నారు.

వైద్యఖర్చులకు సాయం



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న గ్రామస్తులు

షాబాద్: మండలంలోని చిన్న సోలీపేట్ గ్రామానికి చెందిన చెక్కలి జంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఆదివారం గ్రామస్తులు అతడి ఆస్పత్రి ఖర్చుల కోసం సాయం చేయడానికి ముందుకు వచ్చారు. గ్రామస్తుల సహకారంతో చెక్కలి జంగయ్య వైద్యఖర్చుల నిమిత్తం రూ.1,11,000లు అందజేశారు. ఆపదలో ఉన్న పేదవాడిని ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమ్యారాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ మామిడి లతమహిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కావలి గోపాల్, శంకర్ ఉన్నారు.

అడుగుకో గుంత!

- పాడైన బీటీరోడ్లతో వాహనదారుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని వినతి



గుంతలమయంగా ఉమ్మెంత్యాల రోడ్డు



అధ్వానంగా జాకారం రోడ్డు

కొందుర్గు: బీటీరోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో రామచంద్రాపూర్ నుంచి రేగడిచిల్కమర్రి రోడ్డు, శ్రీరంగాపూర్ నుంచి తంగెళ్లపల్లి రోడ్డు, కొందుర్గు నుంచి ఉమ్మెంత్యాల రోడ్డు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని కొందుర్గు వయా తూంపల్లి చౌదరిగూడ రోడ్డు, చౌదరిగూడ నుంచి చేగిరెడ్డిఘనాపూర్ జాకారం రోడ్డు, చేగిరెడ్డిఘనాపూర్ నుంచి గాలిగూడ రోడ్డు గుంతలమయంగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్లపై వాహనాలు నడపాలంటేనే భయంగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొత్తవారు ఎవరైనా రాత్రివేళలో ఈ రోడ్లపై వాహనాలపై వెళ్తే ప్రమాదాలు తప్పవని అంటున్నారు. రోడ్లు బాగు చేయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు మాత్రం తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

గురుస్వామి కుటుంబానికి చేయూత



గురుస్వామి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న శిష్యబృందం

నందిగామ: అయ్యప్ప మాలదారుల ఆరాధ్య దైవం.. ప్రముఖ గురుస్వామి సతీషన్ నాయర్ ఇటీవల అనారోగ్యంతో కన్ను మూయడంతో అయన కుటుంబానికి శిష్యబృందం సభ్యులు చేయూతనందించారు. ఆదివారం మండల కేంద్రమైన నందిగామలోని అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో సభ్యులు గురుస్వామి కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. తమ గురువు కుటుంబానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదని నిర్ణయించుకొని తమకు తోచిన విధంగా ఆర్థికసాయం అందించామన్నారు. ఈ సందర్భంగా శిష్యబృందం సభ్యులు మాట్లాడుతూ.. గురుస్వామి సతీషన్ నాయర్ విగ్రహాన్ని నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జిలెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, భక్తులు చెక్కల ఎల్లయ్య, రవీందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వేణు, పూర్ణచందర్, ఆలయ కమిటీ సభ్యులు సుదర్శన్‌గౌడ్, శ్రీకాంత్, మల్లేశ్, తుమ్మల నర్సింహాయాదవ్, శ్రీను, కృష్ణ, ప్రవీణ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ గెలుపే లక్ష్యం'



చిట్టికి నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

మొయినాబాద్‌రూరల్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల బీజేపీ కార్యాలయంలో మొయినాబాద్ మండల మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన అంతంగారి చిట్టిని నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా వారు పాల్గొని ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు శ్రీరామరక్షగా ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. పార్టీ కోసం పనిచేసే వారిని అధిష్టానం ఎప్పుడూ మరచిపోలేదని, పదవులు వాటంతట అవే వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బంటు జ్ఞానేశ్వర్, రాజ మల్లేశ్, శ్యామ్ సుందర్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రయోగాల గురించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: చదువుల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలో ఉన్న ఎస్‌వీఆర్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫెయిర్)ను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన పలు రకాల ఉపకరణాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బట్టీ పద్ధతిలో కాకుండా దృశ్య వీక్షణ, ప్రయోగాలతో కూడిన బోధన ద్వారా విద్యార్థుల్లో పాఠ్యాంశాల పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. తద్వారా వారు తమకు ఆసక్తి ఉన్న చదువులపై మరింత మక్కువ పెంచుకొని తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అంతేకాకుండా విద్యార్థి దశ నుంచే ప్రయోగాలపై వారికి అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో కొత్త కొత్త ఆవిష్కరణలు చేసేందుకు బీజం పడుతుందన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, సురేందర్, నవీన్‌చారి, పాఠశాల యాజమాన్యం వీరమోని దేవేందర్‌ముదిరాజ్, విన్సంట్‌రెడ్డి, ఉపాధ్యాయులు భవానీ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు..

క్రీడలు ఆయా ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, యువకుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులు, యువత భవిష్యత్‌లో సులువుగా పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో ఉపాధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో చక్కగా రాణించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, నర్సింహ్మ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాల ఊరేగింపు



స్వామివారి కల్యాణం

షాబాద్: మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ఆదివారం మల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలు, మల్లన్న నామస్మరణతో బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయం వద్దకు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గౌరీసతీశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, శకుంతలపాండు, సునితారామస్వామి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



పార్టీలో చేరిన కార్యకర్తలతో విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో బీజేపీ గ్రామ అధ్యక్షుడు ముత్యంరెడ్డి అధ్యక్షతన మాజీ ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి, శ్రీను, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, రవి, కుమార్‌తో పాటు కొంతమంది కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాషాయ జెండాలను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.